క్లుప్తంగా

నేడు ఈ-సిటీలో పారిశ్రామిక ఉత్సవాలు

తుక్కుగూడ: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక ఉత్సవాలను మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల ఈ-సిటీ (అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్)లో నిర్వహించనున్నట్లు పార్టీ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్దఅంబర్‌పేట, 11కేవీ లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు

ఎంపీపీ పాండు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

కందుకూరు: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆరోపించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దళిత మహిళా ఎంపీపీ అని చిన్న చూపు చూస్తూ అవమానిస్తున్నారన్నారు. అధికార కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా మార్చి నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట బీజేపీ జిల్లా నాయకులు ఎస్.మల్లారెడ్డి, బి.సత్యనారాయణరెడ్డి, మంద పాండు, మండల నాయకులు ఎస్.భూమిరెడ్డి, బి.ప్రభాకర్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడికి సన్మానం



సైఫుల్లా రహ్మానిని సన్మానిస్తున్న అబ్దుల్లా సాధి

పహాడీషరీఫ్: ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు 5వ అధ్యక్షుడు ఖాలేద్ సైఫుల్లా రహ్మానిని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాధి సోమవారం ఘనంగా సన్మానించారు. షాహీన్‌నగర్ క్యూబా కాలనీలోని మదర్సాకు విచ్చేసిన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు షేక్ ఖదీర్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీలోని మల్లికార్జున స్వామి దేవాలయ వార్షికోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బస్తీ దవాఖానా ప్రారంభించాలని వినతి



బస్తీ దవాఖానా ప్రారంభించాలని కోరుతున్న సయ్యద్ హుస్సేన్

పహాడీషరీఫ్: పేదలు నివాసం ఉంటున్న వాదే ముస్తఫా బస్తీలో దవాఖానా ప్రారంభించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మంత్రి సబితారెడ్డిని కలిసి విన్నవించారు. వాదే ముస్తఫా బస్తీ 22వ వార్డులో బస్తీ దవాఖానాకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. వైద్యుల కేటాయింపులు పూర్తైన నేపథ్యంలో వెంటనే ప్రారంభించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతుండడాన్ని దృష్టిలో ఉంచుకుని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నాన్, మహ్మద్ పర్వేజ్, సయ్యద్ ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌తో ప్రగతి పథం



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్
- ఘనంగా విద్యుత్ విజయోత్సవ సంబురాలు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరంతర విద్యుత్ సరఫరానే తెలంగాణ ప్రగతికి సోపానం అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లో విద్యుత్ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. గతంలో 11 సబ్‌స్టేషన్లు ఉన్న మన నియోజకవర్గం.. ఇప్పుడు 33 సబ్‌స్టేషన్లతో నిరంతర విద్యుత్ సరఫరా చేసే స్థాయికి చేరుకుందన్నారు. దేశంలో రైతులకు 24గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డీఈ యాదగిరి, ఎంపీపీలు కృపేష్, నర్మద, జెడ్పీటీసీలు మహిపాల్, జంగమ్మ, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

ఆమనగల్లు: నిరంతర విద్యుత్ సరఫరాతో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ విద్యుత్ విజయోత్సవ సభను నిర్వహించారు. ఆమనగల్లు ఏడీఈ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో వచ్చిన మార్పులు అభివృద్ధి పైన వీడియో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో కోతలు లేకుండా వ్యవసాయ రంగంతో పాటు గృహ, వాణిజ్య పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలో గతంలో 36 సబ్‌స్టేషన్లు ఉండగా ప్రస్తుతం 46 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. గతంలో 7121 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా ప్రస్తుతం 12,132 ఉన్నాయని చెప్పారు. సర్‌ప్లస్ పవర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీను, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్లు సత్యం, రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, ఆమనగల్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ, దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్, వైస్ చైర్మన్ సత్యం, విద్యుత్ ఏఈ సీతారాం, మనోజ్, కటారియా, నరేందర్, ఎంపీడీఓ హుస్సేన్, తహసీల్దార్ జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

అతిథి గృహ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం

తుక్కుగూడ: రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాగణంలో శ్రీ రాజరాజేశ్వర గౌడ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ వసతి గృహం నిర్మిస్తున్నారు. ఇందుకు దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ దంపతులు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ గ్రామంలో రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌దాస్‌గౌడ్, హరిచరణ్‌గౌడ్, కాటం భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న తూళ్ల దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

బడంగ్‌పేట్: కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత కోరారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ అంజిరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దృష్టి లోపాలున్నవారు, ఇతర దీర్ఘకాలిక కంటి సమస్యలు, లోపాలతో బాధపడుతున్నవారు ఉచిత పరీక్షలు చేసుకోవాలన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి, వైద్యులు, ఆశవర్కర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చొద్దు



ధర్నా చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

తహసీల్దార్ వాహనం ఎదుట బైఠాయించిన కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: బడుగు, బలహీన వర్గ పేద ప్రజల ఇళ్లను కూల్చడం దారుణమని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. జీవో నెం-59 ప్రకారం ఇళ్లను రెగ్యులరైజ్ చేసుకున్న పేదలు డబ్బులు చెల్లించడం లేదంటూ సోమవారం సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌లోని కూల్చివేతలకు సిద్ధబడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్, బీజేపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేదల ఇళ్లను కూల్చొద్దని.. కూల్చివేతలకు తీసుకువచ్చిన జేసీబీను తనపైనుంచి తీసుకువెళ్లాలని తహసీల్దార్ వాహనం ఎదుట బైఠాయించారు. రెగ్యులరైజేషన్ చార్జెస్ కట్టేందుకు సమయం పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆరుట్ల సురేష్‌కుమార్, బీజేవైఎం నాయకులు బెంగరబోయిన సురేశ్, ఆకుల అంజన్ కుమార్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కూల్చేస్తాం: తహసీల్దార్

జీఓ 59 ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకుని చార్జెస్ చెల్లించని 50 ఇళ్లను భగత్‌సింగ్ నగర్‌లో గుర్తించామని తహసీల్దార్ జయశ్రీ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కూల్చివేతలకు వస్తే స్థానికులు అడ్డుకున్నారన్నారు. ఇప్పటికైనా వెంటనే చార్జీలు చెల్లించాలని లేదంటే కూల్చివేతలు తప్పని హెచ్చరించారు.

వైభవంగా ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరైన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

హాజరైన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో పునః నిర్మించిన శివరామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుడు రాజుశర్మ సమక్షంలో హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ ఉత్సవాలకు మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులను ఆలయ కమిటీ అధ్యక్షుడు, అర్జున్ అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి, సర్పంచ్ పి.శ్రీనివాస్‌చారి, ఉప సర్పంచ్ జి.శివశంకర్‌గౌడ్ సన్మానించారు. ఈ ఉత్సవాల్లలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ పారిజాత, వివిధ పార్టీల నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, దేప భాస్కర్‌రెడ్డి, కృష్ణనాయక్, ఎల్మటి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చండి

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం

కందుకూరు: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల శ్రీశైలం, కార్యదర్శి వరికుప్పల వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వడ్డెర సంఘం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా వడ్డెర్ల జీవితాల్లో మార్పులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కులస్తులకు న్యాయబద్ధంగా అందాల్సిన హక్కులను కల్పించాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న కందుకూరు మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు డి.వెంకటరమణ, నియోజకవర్గం అధ్యక్షుడు వి.నరసింహ ప్రకటించారు. కందుకూరు మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా దేరంగుల విఠల్, ఉపాధ్యక్షుడిగా వరికుప్పల జంగయ్య, ప్రధానకార్యదర్శిగా దేరంగుల వెంకటరమణ, యూత్ అధ్యక్షుడిగా దేరంగుల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు వరికుప్పల కుమార్, నియోజకవర్గం ప్రధానకార్యదర్శి దేరంగుల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు మండల కమిటీకి నియామకపత్రం అందదజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ఛత్రపతి శివాజీ అడుగు జాడల్లో నడవాలి



యువకులకు కామధేను చిత్రపటాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌గౌడ్

చైతన్యపురి: ఛత్రపతి శివాజీ అడుగు జాడల్లో నడుస్తూ హిందుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక కార్యకర్త లింగాల ప్రవీణ్‌గౌడ్ అన్నారు. శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ఆర్ఎస్ఎస్ వివేకానందనగర్ సంఘ్ చాలక్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీలోని స్వర్ణకార వీధిలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల ప్రవీణ్‌గౌడ్ మాట్లాడుతూ, సమాజానికి శివాజీ చేసిన సేవలను కొనియాడారు. యువకులకు కామధేను చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ్ మంచ్ ప్రముఖ్ బి.రాధాకృష్ణమూర్తి, స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు అనంతాచారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీలో ఇప్పటికే 50 వేల మొక్కలను నాటి సంరక్షిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ తరాలకు నీటి కష్టాలు రాకుండా ఉండాలంటే మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, వార్డు సభ్యులు భిక్షపతి, హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, లక్ష్మణ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పహాడీషరీఫ్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాల్సిన అవసరం ఉందని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.వసంత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జల్‌పల్లి పెద్ద చెరువు సమీపంలో బయో మైనింగ్ కొనసాగుతున్న ప్రాంతంలో సోమవారం ఆమె క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... పర్యావరణ కాలుష్యానికి, ప్రకృతి విధ్వంసానికి, మూగ జీవాల మరణానికి కారణమవుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు.



మొక్క నాటుతున్న కమిషనర్ వసంత

మానవులకు జీవనాధారణమైన మొక్కలను విరివిగా పెంచడం ద్వారానే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆయేషా నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

రంగారెడ్డి కోర్టులు: మనిషి అవసరాల రీత్యా ప్రకృతి వనరులను అపరిమితంగా వాడేస్తున్నాడని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తే కాలుష్యాన్ని కొంత వరకు అదుపులో ఉంచవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి అభిప్రాయపడ్డారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అధ్యక్షతన రంగారెడ్డిజిల్లా కోర్టులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి ఇతర న్యాయమూర్తులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి పట్టాభి రామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, కార్యదర్శి మాధవరెడ్డి, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమూర్తుల సేవలు శ్లాఘనీయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

రంగారెడ్డి కోర్టులు: జిల్లాకోర్టుకు ఇటీవల బదిలీపై వచ్చిన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమాన్ని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వారికి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, కార్యదర్శి పటోళ్ల మాధవ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులు, న్యాయమూర్తులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇటీవల బదిలీపై జిల్లా కోర్టుకు వచ్చిన న్యాయమూర్తుల వివరాలను తెలియజేశారు. మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా పట్టాభి రామారావు, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా పి.ఆంజనేయులు, రెండవ అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఎ.రాధిక, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా డి.ఇందిర, ఐదవ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా ఎస్. మంజుల, నాల్గవ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్-మల్కాజిగిరిగా కె.సౌజన్య వచ్చారని వారిని పరిచయం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయి రెడ్డి, కార్యవర్గ సభ్యులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌరిపల్లి, కేతావత్ తండాలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయ మండపాన్ని నిర్మిస్తున్నారు. వరప్రసాద్‌రెడ్డి సోమవారం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. మండప నిర్మాణానికి రూ.1.20లక్షల విలువైన ఇసుక, సిమెంట్, స్టీల్, కాంక్రీట్ తదితర మెటీరియల్‌ను అందజేశారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి..

వెల్జాల్‌లోని హనుమాన్ ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెల్జాల్‌లో ఆయన పర్యటించారు. హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ స్లాబ్ నిర్మాణానికి మెటీరియల్‌ను అందజేస్తామన్నారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

దిల్‌సుఖ్‌నగర్: క్రిస్టియన్ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్, క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘాల ఐక్య సభ ఆదివారం రాత్రి హరిపురి కాలనీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ, శాంతి, కరుణ, ప్రేమ, సేవ అన్న జీసస్ బోధనలు ఎంతో గొప్పవన్నారు. ఇవి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాల నివారణకు దోహదం చేస్తాయన్నారు. మహేశ్వరంలో సమాధుల తోటకు స్థలం కేటాయించినట్టు ఇక్కడ కూడా ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూస్తూ అన్ని పండుగలు అధికారికంగా నిర్వహిస్తున్నారు. క్రిస్టియన్ మైనారిటీల ఆత్మగౌరవం పెంపొందించేలా 2 ఎకరాల స్థలంలో 10 కోట్ల రూపాయలతో క్రిస్టియన్ భవనం నిర్మిస్తున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద క్రిస్టియన్ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందించడంతోపాటు ఆరోగ్య సమస్యలు ఉంటే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నాగేష్, సీనియర్ నాయకులు సాజిద్, శ్రీనివాస్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్, ఇమ్మ్యునేజర్, జయరాజ్ ప్రవీణ్‌కుమార్, రమేష్‌కుమార్, వినోద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్స్, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు